# సింగిల్ పేజి కథలు

## ముసుగు

“ఇదిగో మీతో ఒక మాట చెప్పాలి, ఇలా రండి” సరోజ మాట అందంటే దానికి తిరుగుండదు.

చేతిలోని పేపరు అక్కడ పడేసి రామారావు ఆమెను సమీపించాడు. “ఏమిటి సంగతి” అన్నాడు.

సరోజ జవాబివ్వక పక్కింట్లోకి, కిటికీలోంచి తొంగి చూస్తోంది.

“చెప్పేది, చెప్తే వినేసి, నేను పోయి పేపరు చదువుకుంటాను” అన్నాడు కాస్త అసహనంగా.

సరోజ కొరకొరా చూసి “ఏం నిలబడలేక పోతున్నారా! ఆగండి కాసేపు” అని గదమాయించడంతో అతడి నోరు మూతపడింది.

తదేకంగా అటుచూసిన సరోజ, మొగుడు వైపు తిరిగి “రండిలా, మీరు కూడా చూడండి” అంది అతడి చేయి పట్టుకు లాగుతూ. ఏం చూడాలో అర్థం కాకపోయినా, ఆవిడ చెప్పింది కాబట్టి తను కూడా తొంగి చూసాడు ‘తన భార్యను అంతగా కట్టిపడేసిన దృశ్యమేమిటా!’ అని.



పక్కింటావిడ నీళ్ళలోంచి బట్టలను గట్టిగా పిండి ఇస్తూంటే ఆమె భర్త వాటిని ఆరేస్తున్నాడు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, ఇద్దరికీ సంబంధించిన పని అన్నట్లు కలిసి చేస్తున్నారు. ‘చచ్చాంరా దేవుడా, మళ్ళీ ఇది నాకు క్లాసు పీకుతుంది కాబోలు’ అని గతుక్కుమన్నాడు. “చూసారా! సంసారమంటే అది. ఒకరికొకరు సాయం చేసుకుంటూ, సరదాగా బ్రతుకుతున్నారు. మనమూ వున్నాము ఎందుకూ? ఎంతసేపూ ఇల్లొక లైబ్రరీలా పేపరో, పుస్తకమో పట్టుకొని కూర్చుంటారు. నాకెంతసేపూ వంటిల్లు పుస్తె. ఒక సరదా, సంతోషం లేదు. అచ్చటా, ముచ్చటా లేదు” అంది ముక్కు చీదుతూ.

భార్య మాటలకు ఏం జవాబివ్వాలో తెలీక “ఏం కావాలో చెప్తే, నేను చేయనా! ఈరోజు సెలవు రోజు కాబట్టి ఖాళీ దొరికిందని పేపరు చదువుతున్నాను” అన్నాడు భార్యను శాంత పరుస్తూ.

కానీ సరోజ తగ్గలేదు “మనసుండాలే కానీ, పనిచేయాలంటే దొరకదా! ఇదిగో కూరలు పట్రండి నాలుగు రోజులకి సరిపడేవి” అని సంచి తెచ్చి అతడి దగ్గర పడేసింది. ఇక తప్పదన్నట్లు పేపరక్కడ పడేసి వెళ్ళాడు.

* * *

వంట పూర్తవడంతో సరోజ టీవీ చూస్తోంది. తలుపు చప్పుడు కావడంతో లేచి తలుపు తీసింది. పక్కింటి పద్మ నిలబడి వుంది. “లోపలికి రావచ్చా ఆంటీ” అంటూ.

సరోజ రమ్మని పక్కకు తప్పుకుంది.

పద్మ ఏదో ప్రయివేటు కంపెనీలో జాబు చేస్తోంది. ఆమె భర్త శేషాద్రి గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసరు. ఎప్పుడయినా ఎదురుపడితే పలకరింపుగా నవ్వుకోవడమేకానీ ఇంటికి రావడం ఇదే ప్రథమం. పద్మ కూర్చున్నాకా, సంగతేమిటన్నట్లు చూసింది సరోజ. అంతవరకూ రహస్యంగా చేతిలో పట్టుకున్న కవరు సరోజ చేతికిచ్చింది. సరోజ అర్ధం కానట్లు చూసింది. “నాకు చిన్న సాయం చేయాలి ఆంటీ” అంది సంకోచిస్తూ.

సరోజకి కుతూహలం కలిగింది. ఉద్యోగం చేసుకునే అమ్మాయి, తన సాయం అడుగుతోందని “ఏం చేయాలో చెప్పు పద్మా! నాకు చాతనయినది తప్పక చేస్తాను” అంది.

“ఈ కవరులో అయిదు వేలున్నాయి. నేను అడిగినప్పుడు ఇద్దురుగాని మీ దగ్గరుంచండి” అంది వేడుకోలుగా.

“నా దగ్గర వుంచాలంటే సంగతి తెలియాలిగా. ఎవరి సంపాదన వారికుంది. నేను చూస్తూనే వున్నాను కదా! మీ ఆయన మంచి మనిషే. నీకు పనిసాయం చేస్తాడు, సరదాగా వుంటాడు. మరి అతడికి తెలియకుండా ఈ దాపరికం ఏమిటి” అంది.

పద్మ కంట్లోంచి కన్నీటి బొట్టు రానా వద్దా అని ఊగిసలాడి ‘టప్’మని జారిపడింది. “ఆంటీ ఎందుకో మీ దగ్గర నా కష్టం చెప్పుకోవాలనిపించి, ఇలా వచ్చాను. మీరన్నట్లుగా ఆయన మంచి వారే. నలుగురిలో వున్నప్పుడు ‘మంచితనం’ ముసుగు తగిలించుకున్నప్పుడు. మరి ఆ ముసుగు తీసేస్తే...మా ఆయన చాలా కాలిక్యులేటెడ్ మనిషి. ప్రతి పనీ ఆలోచించి అందులో లాభముంటే చేస్తాడు. చాలా పొదుపు పాటిస్తాడు. ఇంటికి కావలసినవన్నీ కొంటాడు కానీ భార్య పట్ల నిర్లక్ష్యం, అసహనం. పది రూపాయలకు కూడా లెక్క చెప్పమనడం పద్మకి చాలా కష్టమనిపిస్తుంది. పెళ్ళి కానంతవరకు నేను ఫ్రీ బర్డ్‌లా బ్రతికాను. ఇప్పుడు పంజరంలో పక్షిలా విలవిలలాడుతున్నాను. ఆర్థిక స్వేచ్ఛ కావాలంటే ఉద్యోగం చేయాలనే నిర్ణయానికి వచ్చి ఆయనకి చెబితే అతడు ఎగిరి గంతేసాడు. నేను ఎక్కువగా శ్రమ పడకుండానే ఉద్యోగం దొరికింది. జీతం ఏడు వేలు. ఇదివరకు ఇంట్లోనే చాకిరీ. ఇప్పుడు ఇంటాబయటా కూడా నా పని పెనం మీంచి పొయ్యిలో పడ్డట్లయింది. ఇంతా చేసి ఆర్థిక స్వేచ్ఛ ఉందా అంటే జీతం కవరు భర్త చేతికిస్తే, దయతలచి వెయ్యి రూపాయలిస్తాడు ఖర్చులకి. అందులోనే

బస్సుకి తన అవసరాలకు. ఉద్యోగం చేస్తే తనకంటూ సంపాదన వుంటుంది నచ్చినట్లుగా ఖర్చు పెట్టుకోవచ్చు ననుకున్నాను. కానీ తనకన్నా ముందే ఎదురు చూస్తూ ఆ జీతం కవరు లాక్కుంటే ఇక ఆర్థిక స్వేచ్ఛ ఎక్కడుంది? ఎప్పుడయినా తన వాళ్ళెవరయినా వస్తే మళ్ళీ ఆయన ముందు చేయి జాపాల్సిందే. అది ఇష్టంలేక నా ఖర్చులన్నీ చాలామటుకు కట్ చేసి అయిదు వేలు దాచగలిగాను. ఒకసారి 'ఇంటాబయటా చేయలేకపోతున్నాను. ఉద్యోగం మానేస్తాను' అంటే ఆయన దారికొచ్చాడు. 'ఆ పని మాత్రం చేయకు. సెలవు రోజున నీకు సాయం చేస్తాను' అని 'మంచితనం' ముసుగు వేసుకున్నాడు. ఆ ముసుగు మనిషినే మీరు చూస్తున్నారు. నేను వుద్యోగం మానేస్తే ఆ ముసుగు తీసేసి మామూలు శేషాద్రి అయిపోతాడు" అంది పద్మ తేలికగా నవ్వుతూ.

పద్మకి కాఫీ ఇచ్చి పంపుతూ, "ఎలాంటి సాయమైనా చేస్తాను. మొహమాటపడక అడుగు పద్మా" అంది జాలి నిండిన మనసుతో.

పద్మ వెళ్లాక తను కూడా 'గయ్యాళి' ముసుగు ధరించి భర్తను ఆడించడం గుర్తొచ్చింది. రామారావుకి ఎలాటి వ్యసనాలు, అలవాట్లు లేవు. ఆఫీసు, ఇల్లు ప్రపంచం. జీతం కటింగులు పోగా మొత్తమంతా తన చేతుల్లో పోస్తాడు. తను ఏం చేసినా, ఎలా ఖర్చుపెట్టినా ఏనాడూ అడగడు. పొద్దున్న పోయి, రాత్రికి వస్తాడు. అయినా తను ఇంట్లో వుండి కష్టపడిపోతున్నట్లు, అతడు బయటికెళ్ళి సుఖపడిపోతున్నట్లు సాధిస్తుంది. ఎంత విదిలించినా అదిలించినా పల్లెత్తు మాట అనడు. తనకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పద్మకెక్కడిది? పద్మ వచ్చి తన కళ్ళు తెరిపించింది. ఇక నుండీ తన భర్తను సాధించకుండా మంచిగా చూసుకోవాలని నిర్ణయానికి వచ్చిన సరోజ తను కూడా 'గయ్యాళి' ముసుగుని తొలగించి, స్వచ్ఛమైన మనసుతో భర్త రాకకై ఎదురు చూడసాగింది.

అయితే సరోజకి తెలీని దేవరహస్యం- ప్రతిరోజూ సరోజ రామారావుని పెట్టే సాధింపులు, విదిలింపులు అన్నీ వారి చెవిన పడుతున్నాయని, సరోజలో పరివర్తన కోసమే శేషాద్రి 'విలన్' ముసుగు ధరించి పద్మతో ఆ కథ చెప్పించాడని.

**-ఎ.రాజరాజేశ్వరి** (బెంగుళూరు)

# చివరి కోరిక

**"రెడ్డిగారూ! ఎప్పుడొచ్చారు? ఈ యేడాది మామిడికాయలు విపరీతంగా కాసాయి. దొంగలు పడకుండా జాగ్రత్తగా చూస్తున్నాను" చెబుతున్నాడు పుట్టాలు.**

**"పుట్టాలూ! అవన్నీ ఎందుకు? నిన్నేమైనా అడిగానా? మా నాన్న హయాం నుంచి ఈ తోటలో పనిచేస్తున్నావు. స్వంత తోటలా భావించే నిన్ను ఎప్పుడైనా ఏదైనా అంటే అది నా పొరపాటు అని అనుకుంటాను. అది సరేగాని, టెంకాయలు అమ్మకం ఎప్పుడు పెట్టావు?" అడిగాడు రెడ్డిగారు.**

"రేపు వచ్చి బండిలో తీసుకెళ్తారయ్యా. డబ్బులు రమేష్ రెడ్డిగారికి ఇచ్చిపోతామన్నారు. మీ ఇంటికి రాలేదా?" అన్నాడు పుట్టాలు.

ఆ తోట గునుపాటి ఆదిశేషారెడ్డి వాళ్ళది. తోటమాలిగా వాళ్ళ నాన్న హయాం నుండి పనిచేస్తున్నాడు పుట్టాలు. రెడ్డిగారు ఇచ్చింది తీసుకుంటాడు గానీ అడగడు. వాళ్ళకు కూడా పుట్టాలు అంటే మనస్సులో అంత అభిమానం.

వైరు మంచం మీద పడుకొన్నాడు శేషారెడ్డి. అప్పుడే వారి రెండవ కుమారుడు రమేష్ రెడ్డి తోటలోనికి వచ్చాడు. అక్కడ కుర్చీ వేశాడు పుట్టాలు. శేషారెడ్డిగారు నవ్వుతూ "పుట్టాలూ! నీవు చనిపోయినా కూడా ఇక్కడే సమాధి కట్టిస్తే, గాలిలో కాపలా కాస్తుంటావు కాబోలు" అన్నాడు.


"అయ్యగారూ! నాకు డెబ్బై ఏళ్ళు వచ్చాయి. మీ అండతో నా కుటుంబం ఏ దిగులూ చింత లేకుండా గడుస్తున్నది. మీ దయవలన సంసార బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించాను. అయితే ఒక్క కోరిక నాకు మిగిలి ఉంది. అబ్బాయి ఎదురుగా చెబుతున్నాను. నేను చస్తే, తెలిసిన వెంటనే మీరు రావద్దు" అన్నాడు.

"అదేమిటి అలాగంటావు పుట్టాలూ! ఇన్నాళ్ళు మాకు సేవ చేసిన నిన్ను కనీసం చూడ్డానికి కూడా రావద్దంటావే?" అన్నాడు రమేష్ రెడ్డి.

"అది కాదు అయ్యా! నాకు ఏ కోరిక లేదు. ఇంతవరకు మా గూడెంలో ఎవరు చచ్చిపోయినా పూల మాల వేసేవారే లేరు. నాకు నా శవంపై పెద్ద పూలమాల వేయించుకోవాలని ఉంది" అన్నాడు పుట్టాలు.

తరువాత ఆరు నెలలు గడిచాయి. రెడ్డిగారు కుమారునితో తోటలోనికి వచ్చారు. "అయ్యా! పుట్టాలయ్యకి గుండెనొప్పి అంట. ఇందాకే చనిపోయాడు" అని వాళ్ళ తమ్ముడు వచ్చి చెప్పాడు.

"నాన్నా! నేను గంటలో వస్తాను. ఇక్కడే ఉండండి"



అంటూ కారులో నెల్లూరు పోయి వచ్చాడు రమేష్ రెడ్డి. కారులో ఆరు వందల రూపాయలు విలువ చేసే పెద్ద గులాబీ మాల, పెద్దగంప నిండా పూలు. ఇద్దరూ కలసి పుట్టాలుకు మాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, సమాధి పూర్తయిన తర్వాత ఇంటికి బయలుదేరారు.

సంవత్సరాలుగా తమ కుటుంబానికి సేవలందించిన పుట్టాలు చివరి కోరిక తీర్చినందుకు ఎంతో తృప్తిగా ఉంది రెడ్డిగారికి.

**-తిప్పావఝుల సుబ్రహ్మణ్యం**

(ఇందుకూరుపేట)